క్లుప్తంగా

2న సీపీఎం బస్సు యాత్ర



ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో సీపీఎం నాయకులు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ వచ్చే నెల 2న చేపట్టనున్న ప్రజా రక్షణ బస్సు యాత్రపై ప్రచారం చేశారు. పార్టీ మండల కార్యదర్శి రామారావు మాట్లాడుతూ మన్యంలో వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు కల్పించాలని, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటుచేయాలని కోరారు. పార్టీ చేపట్టనున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు మగ్గన్న, గురుమూర్తి, భగత్‌రాం, నానిబాబు, రామన్న, కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఎల్‌ఓల సమావేశం

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని బీఎల్‌వోలతో సమావేశం నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ నాగమ్మ సోమవారం ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే సమావేశానికి బూత్ స్థాయి అధికారులు, వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆమె కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న సుధాకర్

రంపచోడవరం : మారేడుమిల్లి ఏకలవ్య పాఠశాల సమీపంలో సోమవారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ పాఠశాలలో పనిచేస్తున్న సీహెచ్.సుధాకర్ బైకుపై పాఠశాలకు వెళ్తున్న సమయంలో కోతి అడ్డురావడంతో కింద పడిపోయాడు. దీంతో అతని మోహానికి తీవ్ర గాయాలయ్యాయి. అతనిని పాఠశాల సిబ్బంది రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. తక్షణమే స్పందించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి సారథ్యంలో డాక్టర్ ఏ.వి. క్రాంతికిరణ్ ప్రమాద బాధితుడికి శస్త్రచికిత్స జరిపారు.

ఐటీడీఏ పీవోకు వినతి



ఐటీడీఏ పీవో చైతన్యకు వినతిపత్రం అందచేస్తున్న సీపీఎం ప్రజాప్రతినిధులు

చింతూరు: నాలుగు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరుతూ సీపీఎం నాయకులు స్థానిక ఐటీడీఏ ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నష్టపోయిన పంటలకు సర్వే నిర్వహించి సంబంధిత రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. అనంతరం వారు ఐటీడీఏ పీఓ కావూరి చైతన్యకు వినతిపత్రం అందచేశారు.. ఎంపీపీ కె.లక్ష్మి, కె.పెంటయ్య ,బుచ్చమ్మ ,వెంకమ్మ, శంకర్, అమ్మాజీ, జయసుధ , లక్ష్మి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వే వేగవంతం



మాట్లాడుతున్న ఎమ్మార్వో శ్రీనివాసరావు

వై.రామవరం: మండలంలోని గ్రామాల పరిధిలో భూ రీసర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో బీఎల్‌పీ, సర్వేయర్లతో సోమవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలిచ్చారు. అలాగే ఓటర్ లిస్టుల్లో తప్పులను సరిచేయాలని సూచించారు. ఓటరు కార్డులో తప్పులు ఉంటే సరిచేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అడ్డతీగల: రంపచోడవరం మండలం ఉసిరిజొన్నల వద్ద ఎన్‌హెచ్-516ఇ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మంగళవారం సాయింత్రం 3.30 నుంచి 6 గంటల వరకూ అడ్డతీగల, వై.రామవరం మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ మహ్మద్ యూసఫ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలన్నారు.

అడుగడుగునా నీరాజనం

- పాడేరులో సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం
- తరలివచ్చిన గిరిజనులు



మెడికల్ కాలేజీ మోడల్‌ను పరిశీలిస్తున్న పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం రాజన్న దొర, ఎంపీ మాధవి, ఎమ్మెల్యేలు తదితరులు



డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ సుబ్బారెడ్డి తదితరులు

సాక్షి, పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరు మెయిన్‌రోడ్డులో ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతమైంది. కార్యక్రమానికి వేలాదిగా గిరిజనులు తరలివచ్చారు. తలారిసింగి మెడికల్ కళాశాల సెంటర్ నుంచి సతకంపట్టు వరకు భారీ నిర్వహించారు. జై జగన్ నినాదాలతో ఈ ప్రాంతం మార్మోగింది. సామాజిక సాధికార బస్సు యాత్రను వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

అడ్డాకుల టోపీలు.. బాణాలతో సందడి

సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా నిర్వహించిన సభ వేదికపై అడ్డాకుల టోపీలు, విల్లంబులతో నాయకులు సందడి చేశారు. డిప్యూటీ సీఎంలు రాజన్నదొర, ముత్యాలనాయుడు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు, రాజాం ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కంబాల జోగులు, జెడ్పీ, జీసీసీ చైర్‌పర్సన్లు సుభద్ర,డాక్టర్ స్వాతిరాణిలకు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,డాక్టర్ నరసింగరావు దంపతులు అడ్డాకులతో తయారు చేసిన టోపీలు,విల్లంబులను బహూకరించారు. నేతలతో పాటు ఎమ్మెల్యే కూడా వాటిని ధరించారు. విల్లంబులను గురి ఎక్కుపెట్టారు. కొద్దిసేపు నృత్యం చేశారు. బహిరంగ సభలో ఎస్టీ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, ఉమ్మడి విశాఖ జిల్లా బీసీ కార్పొరేషన్ చైర్మన్ అనూషా పట్నాయక్, ఇతర ప్రతినిధులు పిల్లి సుజాత, బి.పద్మావతి, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, ఎస్టీ కమిషన్ సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, జంపరంగి లిల్లీ, ఎంపీపీలు ఎస్.రత్నకుమారి, బోయిన కుమారి, కోరాబు అనుషాదేవి, బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యులు పోతురాజు బాలయ్యపడాల్, మార్కెట్ కమిటీ చైర్మన్లు కూతంగి సూరిబాబు, రాజులమ్మ, స్వచ్ఛ కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, పలు మండలాల పార్టీ అధ్యక్షులు సీదరి రాంబాబు, మోరి రవి, జల్లి బాబులు, లక్ష్మణ్, మత్స్యకొండంనాయుడు, నాయకులు, జర్సింగి సూర్యనారాయణ, సీదరి మంగ్గన్నదొర, కమ్మిడి అశోక్, ఆనంద్, కూడా సురేష్ కుమార్, జల్లి సుధాకర్, కొట్టగుళ్లి నాగేంద్ర, కొట్టగుళ్లి కొండాజి, బోనంగి రమణ, శివప్రసాద్, పాస్టర్ల సంఘం పాడేరు డివిజన్ అధ్యక్షుడు మోద బాబూరావు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గళమెత్తిన వంగపండు ఉష

బస్సు యాత్రకు తరలివెళ్లిన జనం

కొయ్యూరు: పాడేరులో సోమవారం నిర్వహించిన సామాజిక సాధికారిత బస్సు యాత్రకు ఎంపీపీ బడుగు రమేష్, డౌనూరు ఎంపీటీసీ సభ్యుడు బి.అప్పారావు, సర్పంచ్ పొట్టిక భవానీ, కొయ్యూరు నుంచి వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, ఆడాకుల నుంచి వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివెళ్లారు.



థ్యాంక్యూ సీఎం సార్ పేరుతో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కాంట్రాక్టు టీచర్లు



పాడేరు పట్టణంలో సామాజిక సాధికార బస్సుయాత్ర

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ వరహాలమ్మ



సీతగుంటలో వైద్య సేవలను పరిశీలిస్తున్న నోడల్ అధికారి డాక్టర్ రమేష్‌బాబు

పెదబయలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఈ మేరకు చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ ఎం.రమేష్‌బాబు అన్నారు. మండలంలోని సీతగుంట పంచాయతీ కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ బొండా వరహాలమ్మ , జెడ్పీటీసీ సభ్యురాలు కూడ బొంజుబాబు, సర్పంచ్ మాధవ రావు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న నోడల్ అధికారి రమేష్‌బాబు మాట్లాడుతూ పేదలు ఆరోగ్యంగా ఉండాలని, కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఎంపీపీ వరహాలమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల చెంతకే వైద్య సేవలందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 542 మందికి వైద్య సేవలందించారు. ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో పోషకాహారాల ఎగ్జిబిషన్ నిర్వంచారు. గర్భిణులకు సీమంతం చేశారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణారావు, డాక్టర్లు సర్వేశ్వరరావు, కిశోర్ కుమార్, కిరణ్‌కుమార్, ఎంపీడీవో ఎల్. పూర్ణయ్య, ఆర్‌ఐ సింహాచలం, సీడీపీవో రాజేశ్వరి, వైస్ ఎంపీపీ రాజుబాబు, ఎంపీటీసీ సభ్యుడు బొంజుబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

హుకుంపేట: మండలంలోని డాక్టర్ వైఎస్సార్-టీఏస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియ జిల్లా కన్వీనర్ తెడబారికి సురేష్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని, గిరిజన యువత ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, అడిషనల్ ఎస్పీ అనిల్ ముఖ్య అతిథులుగా పాల్గొననున్నట్టు ఆయన తెలిపారు.

హైందవ ధర్మ పరిరక్షణకు కృషి



సమావేశమైన సంఘం నాయకులు

కొయ్యూరు: మండలంలోని బూదరాళ్ల పంచాయతీలో శ్రీరామ నామస్మరణతో నిర్వహిస్తున్న శాంతి పాదయాత్రను విజయవంతం చేయాలని హైందవ సైన్యం ప్రతినిధులు కోరారు. సంస్థ వ్యవస్థాపకులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ హైందవ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. ఆలయాల్లో నిర్వహిస్తున్న భజన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. గిరిబాబు, నాగేశ్వరరావు, కె.లింగమూర్తి పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు చట్టబద్ధమే



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో మండల పార్టీ అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్ సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కిల్‌డెవలప్‌మెంట్ స్కామ్‌లో సీబీఐ అధికారుల విచారణ అనంతరం కోర్టు తీర్పు ప్రకారం చంద్రబాబు అరెస్టు చట్టబద్ధంగా జరిగిందన్నారు. చంద్రబాబు అరెస్టుపై టీడీపీ అనవసర రాద్ధాంతం చేస్తుందని ఖండించారు. టీడీపీ కుట్ర రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, సరైన విధంగా బుద్ధి చెబుతారన్నారు. ఎంపీపీ సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, పార్టీ జిల్లా కార్యదర్శి జగబంధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల నిలుపు ఉత్సవం

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో సోమవారం గౌరీ పరమేశ్వరుల నిలుపుదల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గౌరీ పరమేశ్వరుల ఆలయం నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా సంతబయల చేరుకుని వరి దుబ్బును తీసుకువచ్చి ఆలయంలో ఉంచారు. అనంతరం నూతనంగా తయారు చేసిన గౌరీపరమేశ్వరుల విగ్రహాన్ని విశ్వ బ్రాహ్మణుల ఇంటి నుంచి డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తెచ్చి, ఆలయంలో నిలుపుదల చేసి, ప్రత్యేక పూజలు జరిపారు. భాస్కరరావు, బుజ్జి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై అవగాహన తప్పనిసరి



డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గణేష్

యలమంచిలి: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని యలమంచిలి సెబ్ ఎస్ఐ గణేష్ హితవు పలికారు. అనకాపల్లి సెబ్ జాయింట్ డైరెక్టర్ ఏఎస్పీ కె.విజయభాస్కర్ ఆదేశాల మేరకు సోమవారం యలమంచిలి పట్టణం గీతాంజలి కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రస్తుత సమాజంలో ఎక్కువగా యువత డ్రగ్స్‌కు బానిసలుగా మారి, జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, అలాంటి వారికి సహకరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలో ఎవరైన గంజాయి, మత్తు పదార్థాల వినియోగం, రవాణాపై సమాచారం ఉంటే సెబ్ అధికారులకు తెలియజేయాలని కోరారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఉన్నత భవిష్యత్తుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.పద్మ, షేక్ హష్మా, బి.కరుణ, లక్ష్మి, సాయిదుర్గాప్రసాద్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

చిలగడ దుంపల సేకరణలో గిరిజనులు



చిలగడ దుంపలు శుభ్రం చేస్తున్న గిరిజన రైతులు

డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ, గసభ పంచాయతీల్లో గిరిజన రైతులు విస్తారంగా చిలగడ దుంపల సాగు చేపట్టారు. గత ఏడాది కంటే ఈ ఏడాదిలో దిగుబడి బాగుందని గిరిజన రైతులు చెబుతున్నారు. వారపు సంతల్లో విక్రయించేందుకు గిరిజన రైతులు చిలగడ దుంపలను సేకరణలో బిజీబిజీగా ఉంటున్నారు. వాటిని సేకరించి శుభ్రం చేసి ఆయా వారపు సంతల్లో విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వీటి ధర 50 కిలోల బస్తా రూ.900 నుంచి రూ.1200 వరకు విక్రయిస్తున్నారు. దీంతో మంచి గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

త్వరితగతిన ఇంటిపన్ను వసూలుకు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: త్వరితగతిన ఇంటిపన్ను వసూలుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సూచించారు.ఆయన కార్యాలయంలో సోమవారం , పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ కొత్త ఇళ్లకు నెంబర్లు కేటాయించాలని సూచించారు. ఇంటి పన్నును ఐదు శాతం పెంచి వసూలు చేయాలని సూచించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు లేని వారి వివరాలను తెలుసుకోవాలని, వృత్తి పన్ను వసూలు చేయాలన్నారు. పాఠశాలల్లో నూరుశాతం జీఈఆర్ నమోదయ్యే విధంగా చూడాలని సూచించారు. జనన, మరణ ధ్రువపత్రాలకు సంబంధించిన వివరాలు అందజేయలన్నారు. తాగునీటికి సంబంధించి గ్రావిటీ పనులు పరిశీలించాలన్నారు. ఈవోపీఆర్‌డీ పాపారావు తదితరులు పాల్గొన్నారు

శ్రమదానంతో రోడ్డు నిర్మాణం



శ్రమదానంతో మట్టిరోడ్డును నిర్మించుకుంటున్న గిరిజనులు

అనంతగిరి: మండలంలోని కివర్ల పంచాయతీ పెదబయలు జంక్షన్ నుంచి పోడెల్లి గ్రామం వరకు సుమారు కిలోమీటరన్నర మట్టిరోడ్డును సోమవారం గిరిజనులు శ్రమదానంతో నిర్మించుకున్నారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో 108, 104 వాహనం వచ్చే పరిస్థితి లేక ఇబ్బందులు పడుతున్నామని, అధికారులకు తెలియజేసినా స్పందన లేకపోవడంతో పోడెల్లి గ్రామస్తులంతా కలిసి శ్రమదానంతో మట్టిరోడ్డు నిర్మాణానికి ముందుకొచ్చారు. పోడెల్లి గ్రామ సమీపంలోని పెదబయలు జలపాతం ఉందని, రోడ్డు నిర్మాణం చేపట్టడంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని స్థానికులు రాంబాబు, బుజ్జిబాబు, అబ్బాయినాయుడు, భైరవమూర్తి, తదితరులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతంలో శాశ్వతంగా తారురోడ్డు నిర్మించాలని కోరారు.

పరుపుల పంపిణీ



విద్యార్థులకు పరుపులు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు విశాఖపట్నానికి చెందిన రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పరుపులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రోటరీ క్లబ్ గవర్నర్ డి.సుబ్బారావు మాట్లాడుతూ తమ క్లబ్ తరఫున సేవలను మరింత విస్తృతం చేస్తున్నామన్నారు. రోటరీ క్లబ్ సభ్యుడు, స్థానిక పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఎం.సురేష్‌కుమార్ అధ్యక్షతన చింతపల్లి పాఠశాలలో విద్యార్థినులకు 100 పరుపులు, జి.మాడుగుల మండలం కొక్కిరపల్లి పాఠశాలలో 50 పరుపులు వితరణగా ఇచ్చారు. ఉపాధ్యాయుడు కొండలరావు, వార్డెన్ నూకరత్నం, శాస్త్రవేత్తలు తదితరలు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి



యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గ సభ్యులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శారదా నికేతన్ పాఠశాలలో సోమవారం యూటీఎఫ్ మండల సభ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.రఘునాథ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మండల యూటీఎఫ్ కమిటీ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా ఎం.అప్పలనాయుడు, అధ్యక్షుడిగా ఎస్.రాజు, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.గోపి, కె.శ్రీనివాసమూర్తితో పాటు పలువురు ఎన్నికైయ్యారు. యూటీఎఫ్ జిల్లా కౌన్సిలర్లు ధర్మారావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా అభివృద్ధి పనులు



నందివలసలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం

హుకుంపేట: గ్రామాలభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ముమ్మరంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని రంగశీల పంచాయతీ నందిగూడ గ్రామంలో జెడ్పీ నిధులు రూ.3లక్షల వ్యయంతో జరుగుతున్న నిర్మాణ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధులతో గ్రామల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సర్పంచ్ ముత్యాలమ్మ, నాయకులు మోహన్‌దాస్, ఎంపీటీసీ సభ్యులు రామ్మూర్తి, రామ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అట్లతద్ది పండుగ



పూజా సామగ్రితో మహిళలు

రాజవొమ్మంగి: అట్లతద్ది పండగను మంగళవారం జరుపుకునేందుకు స్థానిక మహిళలు సిద్ధమయ్యారు. కొత్త దుస్తులు, పూజా సామగ్రి కొనుగోలు చేశారు. ఆశ్వయుజ బహిళ తదిత నాడు మహిళలు ఈ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొంటారు. ఈ పండుగనే ఉయ్యాల పండుగ అని, గోరంటాకు పండుగ అని కూడా పిలుస్తారు. తద్ది రోజున వేకువజామునే నిద్ర లేచి శుచి శుభ్రతతో అమ్మవారికి పూజ చేస్తారు, ఆ రోజు సాయంకాలం చంద్రుడిని చూసిన తరువాత మరో సారి గౌరిదేవి పూజ చేసి 11 అట్లు నైవేద్యంగా సమర్పిస్తారు. ఇంటికి వచ్చిన ముత్తైదువులను అలంకరించిన 11 అట్లు, 11 రకాల ఫలాలతో ఇస్తినమ్మ వాయినం-పుచ్చుకొంటినమ్మ వాయినం అంటూ ఒకరి కొకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకొంటారు.

ఉత్తమ వ్యక్తిత్వంతో ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులతో మాట్లాడుతున్న రజాక్

నక్కపల్లి: ప్రతీ ఒక్కరూ విద్యార్థి దశ నుంచే వ్యక్తిత్వం వికాసంపై అవగాహన పెంచుకోవాలని ప్రముఖ న్యాయవాది, మోటివేషనల్ స్పీకర్ ఎంఏ రజాక్ అన్నారు. మండలంలోని పెదబోదుగల్లం హైస్కూల్లో విద్యార్థులకు హెచ్‌ఎం సీహెచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం వ్యక్తిత్వ వికాస తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ ఓటమి నుంచి గెలుపు అనే అంశంపై స్ఫూర్తిదాయక ప్రసంగాన్ని అందించారు. ఓటమి చెందడం నిజమైన ఓటమికాదని, ప్రయత్నించకపోవడమే అసలైన ఓటమి అన్నారు. వైఫల్యాలను ఎదుర్కొని ప్రపంచ వ్యాప్తంగా విజయానికి, యువతకు ప్రేరణగా నిలిచిన స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం, ధోని, సచిన్ టెండూల్కర్, రతన్ టాటా వంటి మహనీయుల జీవితాల్లో జరిగిన యదార్థ సంఘటనలను వివరించి, విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. లక్ష్య సాధనకు విద్యార్థులు నిరంతరం శ్రమించాలన్నారు. ఉత్తమ వ్యక్తిత్వంతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్‌వీఎస్ ఆచార్యులు, ఎస్.ఫల్గుణరావు, ఏవీఎల్ఎన్ కుమారి, రమేష్‌బాబు, చిన్నారావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.